

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రీషెడ్యూల్
కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. - 8లో▸



5 వరకు లా పరీక్షల ఫీజు గడువు
ఆగస్టు 5వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా లా కోర్సు పరీక్షల ఫీజు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29°/25°
జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నగరం జలమయం

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నగరం జలమయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి వరద బాధితులకు భోజన ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, నాయకులు చెన్నమల్లు, స్థానికులు బాలకృష్ణ, లక్ష్మణ్, మురళీకృష్ణ, ప్రేమ, మహేందర్, మహేష్, రాజు, వైశ్య సంఘం నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు ఎకనామికల్ సపోర్ట్ స్కీం ద్వారా రూ.లక్ష (పూర్తి సబ్సిడీతో కూడిన) ఆర్థిక సాయాన్ని అందించేందుకు అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయం, లేదా 040 - 23391067 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

కేయూ హాస్టళ్లు, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా సుచరితపాల్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లు, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా హెచ్ఆర్ఎం విభాగం కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుచరితపాల్‌ను నియమించారు. వీసీ తాటికొండ రమేష్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

శభాష్ విజయ్!



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన రాపాక విజయ్ అనే యువకుడిని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా అభినందించారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి 4వ డివిజన్‌లోని లోటస్‌కాలనీకి చెందిన ఓ కుటుంబం.. ఇంట్లోనే చిక్కుకుంది. అప్పటికే హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కరుణసాగర్‌తో సహాయక చర్యలో నిమగ్నమైన విజయ్.. ఆ ఇంటిలో ఉన్న ఆరు నెలల బాబు, మహిళ, వృద్ధుడిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చాడు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబాన్ని రక్షించిన రాపాక విజయ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఖాజాసిరాజుద్దీన్, బీఆర్ఎస్ నాలుగో డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈస్ట్ జోన్ డీసీపీగా రవీందర్ బాధ్యతల స్వీకరణ



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా పి.రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2010 డీఎస్పీ బ్యాచ్‌కు చెందిన రవీందర్ శిక్షణ తర్వాత మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా నియమితులయ్యారు. అనంతరం కరీంనగర్, సీసీఎస్ హైదరాబాద్‌లో డీఎస్పీగా పనిచేశారు. 2017లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కరీంనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. 2021లో డీసీపీగా పదోన్నతి పొందిన రవీందర్ ప్రస్తుతం సీఐడీ విభాగంలో పనిచేస్తూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ పరిధిలోని అధికారులు, పోలీస్ సిబ్బంది డీసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వరదలతో దెబ్బతిన్న పరకాలలోని హుజూరాబాద్ రోడ్డు



పట్టణంలో కొట్టుకుపోయిన ఓ ఇంటి ప్రహరీ



వర్షం.. నష్టం

కొట్టుకుపోయిన రహదారులు, కల్వర్టులు
- దుకాణాలు, ఇళ్లలోకి చేరిన వరద నీరు
- బాధితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు

పరకాల : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారి కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని రాజీపేటలో రెండు ఇళ్ల గోడలు కూలిపోయాయి. చెరువులకు బుంగలు పడడంతో నీరు ఉధృతంగా ప్రవహించింది. మరోవైపు పరకాల ప్రధాన రహదారుల కిరువైపులా ఉన్న దుకాణాల్లోకి వరదనీరు చేరడంతో వ్యాపారులకు రూ.లక్షలాది రుపాయల నష్టం వాటిల్లింది. భారీ వర్షంతో చలివాగు వంతెన రోడ్డు తెగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రవాహం కొంత తగ్గడంతో అధికారులు రోడ్డు మరమ్మతు పనులు వేగవంతంగా చేపట్టారు. రహదారుల వెంట వర్షం నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని పలుమారులు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోలేదని, వరదలతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల : భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందు పడకుండా ఉండేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కోరారు. పట్టణంలో ముంపునకు గురైన శ్రీనివాస కాలనీ, మమతానగర్, హుజురాబాద్ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే చల్లా మాట్లాడారు. వరదలకు బయటకు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, కమిషనర్ టి.శే శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పునరుద్ధరణ

భారీ వర్షాలతో చలివాగు ప్రవాహానికి పరకాల-భూపాలపల్లి రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో పరకాల-భూపాలపల్లి మధ్య రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఉదయమే పరకాల చలివాగు వంతెన వద్దకు చేరుకొని రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టారు. రెండు గంటలపాటు అక్కడే ఉండి రోడ్డు పనులను పర్యవేక్షించారు. రోడ్డు పనులు పూర్తికావడంతో వాహనాలు కాకుండా ప్రజల రాకపోకలు మొదలయ్యాయి. ఆ తర్వాత అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.



పరకాలలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



రోడ్డు పునరుద్ధరణ పనులు చేస్తున్న జేసీబీ

బాధితులకు అండగా ప్రభుత్వం

నడికూడ: ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. నార్లాపూర్‌లో శుక్రవారం ఆయన పర్యటించి వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ వరద బాధితులకు వెంటనే పునరావాసం కల్పించాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కోల్పోయిన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. నార్లాపూర్ నుంచి వెంకటేశ్వర్లపల్లి గ్రామాల మధ్య వరద తీవ్రతకు తెగిపోయిన రోడ్డును పరిశీలించారు. తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీపీ మచ్చ అనసూర్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజయ్య



ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని పలు గ్రామాల చెరువులను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో అలుగు పోస్తున్న ధర్మసాగర్, ముప్పారం, నారాయణగిరి, వేలేరు, పీచర గ్రామాల చెరువుల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మసాగర్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 1.5 టీఎంసీలు కాగా.. రిజర్వాయర్‌లోకి అంతకంటే ఎక్కువ నీరు వచ్చి చేరుతోందని చెప్పారు. 6 గేట్లలో మూడు గేట్లు ఎత్తి కిందికి నీళ్లు వదులుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 307.55 ఎఫ్ఆర్ఎల్ నీటి నిల్వ ఉండే విధంగా చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఆర్ఐ కిరణ్, వేలేరు ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాయిత మాదవరెడ్డి, సర్పంచ్‌లు కర్ర సోమిరెడ్డి, గోనెల సమ్మక్క,చిర్ర కవిత, మ్యాక రవీందర్, ఎంపీటీసీలు బొడ్డు శోభ, పెద్ది శ్రీనివాస్, బాల్నె వెంకటేశ్వర్లు, నాయకులు బొడ్డు ప్రభుదాస్, రాజుగారి రఘు, కొలిపాక రజితరమేష్, బైరి శ్రీనివాస్, బొడ్డు సోమయ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పెద్ద చెరువు మత్తడి

కమలాపూర్ : మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఉధృతంగా మత్తడి పోస్తుండడంతో మత్తడి రాళ్లు కొట్టుకుపోయాయి. హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో అక్కడక్కడ ఇసుక మేటలు వేయగా గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. స్థానిక విశ్వపతి ఆలయం నీటితో నిండిపోయింది. ఉప్పల్‌లో ముంపునకు గురైన బీసీ కాలనీకి చెందిన సుమారు 50 మంది, పిట్టలపల్లికి చెందిన సుమారు 30 మందిని అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. భారీ వర్షానికి మండల కేంద్రంలోని 11వ వార్డు మరోసారి ముంపునకు గురైంది. ప్రతిసారి తమకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని, ఇళ్లల్లోకి వరద, మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను స్థానికులు వేడుకుంటున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కొన్ని ఇళ్లు పూర్తిగా, మరి కొన్ని ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కమలాపూర్, గుండేడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలు దెబ్బతిన్నాయి. నేరెళ్ల, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో శ్మశానవాటికల ప్రహరీలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. కాగా, మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



మత్తడి ఉధృతికి కొట్టుకుపోతున్న రాళ్లు

గట్లకానిపర్తిలో పునరావాస కేంద్రం





గట్లకానిపర్తిలో భోజనం వడ్డిస్తున్న ప్రజాప్రతినిధులు, మైలారంలో బియ్యాన్ని ఆరబెడుతున్న మహిళలు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో పెద్దచెరువు ఉప్పొంగి వరదనీరు దళిత కాలనీలోకి చేరింది. దీంతో సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య వరద బాధితులకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించి భోజనాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన బొమ్మకంటి పోశాలు 72 మంది నిర్వాసితులకు భోజనం సమకూర్చారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గే వరకు పునరావాస కేంద్రంలోనే ఉండాలని, అన్ని సదుపాయాలు కల్పిస్తామని సర్పంచ్ కోరారు. మైలారం గ్రామంలో గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి, అదే రోజు రాత్రికి ఇళ్లకు పంపించారు.

చలివాగు ప్రాజెక్టులో 24 ఫీట్ల నీటిమట్టం..

జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టులో 24 ఫీట్ల నీటిమట్టం చేరి నిండుకుండలా మారింది. పత్తిపాకలో మాందాటి వీరమల్లు పంట చేనులో రాళ్ల మేట వేసింది. గంగిరేణిగూడెం గ్రామంలోని 32 ఎకరాల విస్తీరణంలో ఉన్న కొంతకుంట చెరువు కట్ట తెగిపోయింది. దీంతో చెరువులో చుక్క నీరు లేకుండా పోయింది. పెద్దకోడెపాక గ్రామం నుంచి పరకాల హైవేకి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

బంజర్ల కుంట, కొచ్చెరువులకు గండి





బంజర్లకుంటకు గండిపడి వృథాగా పోతున్న నీరు, కొండపర్తి కొచ్చెరువుకు పడిన గండి

ఐనవోలు : కక్కిరాలపల్లి గ్రామంలోని బంజర్లకుంట కట్ట మధ్యలో గండి పడింది. కొండపర్తిలోని కొచ్చెరువు మత్తడి వద్ద గండి పడి నీరు వృథాగా పోతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం చెరువులను సందర్శించారు. అదేవిధంగా కక్కిరాలపల్లిలో కోమటికుంట, పంథినిలో నర్సింహులకుంట, గోలెంకుంట, ఐనవోలులో కాంతవాని కుంట, కుర్మలక్ష్మీకుంట, గర్మిళ్లపల్లిలో కుంచం కుంటలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా బంజర్లకుంటతోపాటు కొండపర్తి కొచ్చెరువుకు త్వరలో తాత్కాలిక పనులు చేపడుతామని చెప్పారు. ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ కింద మండలంలోని 8 చెరువులకు తాత్కాలిక, శాశ్వత పనులకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందజేశామన్నారు. మండల వ్యాప్తంగా 18 పెద్ద చెరువులు, 74 చిన్న చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఆగమాగం..

ఆత్మకూరు: భారీ వర్షాలతో జనజీవనం ఆగమాగమైంది. పలు గ్రామాల్లో ఇళ్ల గోడలు కూలిపోగా.. మరికొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలు అంధకారంలో మగ్గాయి. స్పందించిన విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా కటాక్షపూర్ మత్తడి శాంతించడం లేదు. స్థానిక సీఐ రవిరాజు పరిస్థితిని పరిశీలించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



పెద్దాపూర్‌లో జలమయమైన ఇల్లు

తెరిపిచ్చినా తేరుకోలే..
- ఇంకా వరదల్లోనే పలు కాలనీలు
- శాశ్వత పనులతోనే ముంపునకు పరిష్కారం

ఎన్పీడీసీఎల్‌కు రూ.20కోట్ల నష్టం
టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- వివరాలు 8లో▸

రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు
- మరిన్ని ఫొటోలు 9లో▸



భారీ వర్షానికి జలమయమైన వరంగల్ భద్రకాళి ఆలయ ప్రాంతం



జవహర్ కాలనీలో బురదను మొక్కకు పోస్తున్న మహిళ, రాజాజీనగర్‌లో ఇళ్లలోకి చేరిన బురద

నివారణ చర్యలు తీసుకోవాలి

- బాధితులను ఆదుకోవద్దనడం బీఆర్ఎస్ నాయకులకు తగదు
- ఈ విషయమై మంత్రి కేటీఆర్ స్పందించాలి
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

హన్మకొండ/హసన్‌పర్తి : ముంపు నివారణకు ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలో నయీంనగర్, కిషన్‌పుర, పలివేల్పుల, ఒకటో డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటు వైపు రాలేదని, ఇళ్లలోని సామగ్రి పాడైందని బాధితులు వివరించారు. స్పందించిన ఈటల రాజేందర్ తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వరదలు వచ్చి కాలనీలు ముంపునకు గురైనప్పుడు మంత్రి హోదాలో తాను, కేటీఆర్ పర్యటించామన్నారు. అప్పుడు నాలాలు ఆక్రమణకు గురైనట్లు చూపెట్టారని చెప్పారు. వాటిని తొలగిస్తామని చెప్పారని, తీరా ఇప్పుడు చూస్తే అవి అలాగే ఉన్నాయన్నారు. ముంపు బాధితులను ఆదుకునేందుకు దాతలను రానివ్వకుండా, సాయం చేస్తే తామే చేయాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొనడం మూర్ఖత్వమని, ఈ విషయమై మంత్రి కేటీఆర్ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. దాతలను ఆదుకోనివ్వకపోవడం బీఆర్ఎస్ పతనానికి పరాకాష్ట అని అన్నారు. బాధితులకు బీజేపీ అండగా నిలుస్తుందని వారిని ఆదుకుంటుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సాయం అందించాలని, ముంపునకు గురైన ఇంటికి రూ.25 వేల చొప్పున, ప్రతి దుకాణానికి రూ.50 చొప్పున పరిహారం చెల్లించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కార్పొరేటర్ చాడ స్వాతి, అరుణకుమారి, గురుమూర్తి శివకుమార్, నాయకులు మార్తినేని ధర్మారావు, ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



నయీంనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

కేటీపీపీ పంపుహౌస్‌కు చేరిన వరద


కేటీపీపీ పంపుహౌస్ మోటార్ల సమీపానికి చేరిన వరద

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మెట్‌పల్లి వద్ద గోదావరిని ఆనుకొని నిర్మించిన కేటీపీపీ పంపుహౌస్ వద్దకు వరద ఉధృతి చేరింది. శుక్రవారం రాత్రి మోటార్ల వద్దకు చేరుతున్నట్లు తెలిసింది. వరద పెరిగితే మోటార్లు, కంట్రోల్‌రూం ప్యానల్ బోర్డుల వద్దకు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. గతేడాది జూలై 14న ఎలక్ట్రిక్ కంట్రోల్ రూం మునిగిన విషయం తెలిసిందే.

కేయూ బాటనీ విభాగం అధిపతిగా లక్ష్మారెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ విభాగం అధిపతిగా ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో బాటనీ విభాగంలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.లక్ష్మారెడ్డిని నియమించారు. శుక్రవారం కేయూ వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య మహ్మద్ ముస్తాఫా పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని నియమించారు. ఒక టి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులు...
కాకతీయ యూనివర్సిటీలో బాటనీ విభాగంలో ఇద్దరు రెగ్యులర్ అధ్యాపకులుగా ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితకుమారి ఉన్నప్పటికీ హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని కాంట్రాక్టు లెక్చరర్ లక్ష్మారెడ్డిని క్యాంపస్‌లో బాటనీ విభాగం అధిపతిగా నియమించడం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. యూనివర్సిటీలో చరిత్రలో ఓ విభాగం అధిపతి కాంట్రాక్టు లెక్చరర్‌ను నియమించటం ఇది తొలిసారి. ఇప్పటికే క్యాంపస్‌లో విద్యాకళాశాలలో, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రెగ్యులర్ అధ్యాపకులు లేక పోవటంతో ఆ కళాశాలకు ప్రిన్సిపాల్స్‌గా కాంట్రాక్టులెక్చరర్లకే అప్పగించారు .


మొగుళ్లపల్లి : ముల్కలపల్లి-కొర్కిశాల రోడ్డు


మొగుళ్లపల్లి : రంగాపూర్-ఇస్సిపేట రోడ్డు


గణపురం : నగరంపల్లి వద్ద తెగిన రోడ్డు


దంతాలపల్లి : గండిపడిన సీసీ రోడ్డు

రోడ్లు ధ్వంసం.. ఇసుక మేటలు

నాలుగు రోజులు కురిసిన భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడమే కాకుండా చెరువులు, కుంటలు మత్తళ్లు పడ్డాయి. కొన్ని చోట్ల గండిపడ్డాయి. శుక్రవారం కాస్త వర్షం తగ్గినా వరదలు మాత్రం ఆగడం లేదు. ప్రధాన రహదారులపై కొన్ని చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. కాలనీలు, ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంట చేలల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునగడమే కాకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

- సాక్షి నెట్‌వర్క్


మరిపెడ రూరల్ : పత్తిలో నిలిచిన వర్షపు నీరు


చిన్నగూడూరు : వరద ఉధృతికి చెల్లాచెదురుగా పడి ఉన్న కంపోస్ట్ యార్డ్, వైకుంఠధామాలు


జవహర్‌నగర్ రోడ్డులో వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు


కమలాపూర్ : శివాలయంలోకి ఉబికి వస్తున్న నీటిలో నంది విగ్రహాలు


పాలకుర్తి : లక్ష్మీనారాయణపురంలో వరిపొలాల్లో ఇసుక మేటలు


వరద ముంపునకు గురైన మహ్మద్ ఖాదర్ పాషా గృహం


మల్హర్ : వల్లెకుంట పొలాల్లో ఇసుక మేటలు


పరకాల: తెగిన పరకాల-భూపాలపల్లి రోడ్డు


వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్ట


బచ్చన్నపేట : బొందుగల రోడ్డుపై తెగిన కల్వర్టు


మంగపేట : వరద కోతకు గురైన రోడ్డు

భారీ వర్షాలతో ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- ముంపు ప్రాంతాల సబ్‌స్టేషన్ల పరిశీలన


యాదవనగర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు రూ.20 కోట్ల నష్టం జరిగిందని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని వరద తీవ్రతతో ముంపునకు గురైన యాదవనగర్, గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను సందర్శించారు. అదేవిధంగా కాకతీయ కాలనీలో తెగిపడిన లైనును పరిశీలించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నీట మునిగిన సబ్‌స్టేషన్లతో విద్యుత్ అంతరాయం కలిగిన కాలనీలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో అతి భారీవర్షాల వల్ల వేలాది స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల లైన్లు దెబ్బతిన్నాయని వివరించారు. ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున స్పెషల్ ఆఫీసర్లను, కాంట్రాక్టు ఏజెన్సీలను నియమించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగులు, సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి విద్యుత్ సరఫరా అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. చాలాచోట్ల విద్యుత్ సరఫరా అందించామని, మిగతా ప్రాంతాల్లో త్వరలో పునరుద్ధరణ పనులు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి, ఏడీఈలు దర్శన్‌కుమార్, కిషన్, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగస్టు 5 వరకు లా పరీక్షల ఫీజు గడువు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు, ఐదేళ్ల లా కోర్సు రెండో, నాల్గవ, ఆరవ, 8వ, 10వ సెమిస్టర్ పరీక్షలకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంటు) విద్యార్థులు ఆగస్టు 5 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్షల ఫీజులు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో కోరారు. రూ 250 అపరాధ రుసుముతో 8 వరకు గడువు ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ఫీజు రూ.1030, మూడేళ్ల ఆరవ సెమిస్టర్, ఐదేళ్ల 10వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు రూ.1360, బ్యాక్ లాగ్స్ రెండు పేపర్లకు పైన ఫీజు రూ.930, రెండు పేపర్ల వరకు రూ.400, ఇంప్రూవ్‌మెంటు ప్రతి పేపర్‌కు రూ 300ల చొప్పున పరీక్ష ఫీజు చెల్లించాల్సింటుందని వారు పేర్కొన్నారు.

వరదలకు కొట్టుకొచ్చిన మృతదేహాలు లభ్యం


వరదనీటిలో శ్రీను మృతదేహం

రామన్నపేట : నగరంలోని రామన్నపేటలో రిక్షా తొక్కుతూ జీవనం సాగించే నరంశెట్టి శ్రీను (40) మృతదేహం వరదల తాకిడికి రామన్నపేట ఎస్సీ కాలనీలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కురిసిన భారీవర్షం వరదలకు కాలనీ అంతా జల దిగ్బంధంలో చిక్కుకుంది. శుక్రవారం ఉదయం కాలనీ వాళ్లు నిద్రలేచే సరికి కాలనీలో నీటిలో శ్రీను మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతుడి స్వగ్రామం నర్సంపేట మండలం గుండ్రాయిపల్లి గ్రామంగా గుర్తించారు. అత్తగారిల్లు కీర్తినగర్. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిపారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోపాలపురంలో యువకుడు..
హసన్‌పర్తి: వరదల్లో గల్లంతైన టీఎన్జీవోస్ కాలనీ-2కు చెందిన గట్టు రాజు మృతదేహం గోపాలపురం చెరువులో శుక్రవారం లభ్యమైంది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై విజయ్‌కుమార్ సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రాజు మృతదేహాన్ని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు సురేందర్‌గౌడ్, అనిల్ ఉన్నారు. అలాగే గట్టు రాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబాన్ని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, నాయకులు చింత రమేష్, పెద్ద రాజు, సయ్యద్ ఉమర్ పాషా, తదితరులు ఉన్నారు.

మడికొండ శివారులో..


వెంచర్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహం

మడికొండ: కాజీపేట మండలం మడికొండ శివారులోని ప్రైమ్ సిటీ వెంచర్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మడికొండ శివారులోని వెంచర్‌లో శుక్రవారం సుమారు (50) సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని మృతదేహాన్ని వెంచర్ సూపర్‌వైజర్ తొట్టె తిరుపతి గురువారం వచ్చిన వరదలకు ప్రహరీ కూలిపోగా శుక్రవారం వెంచర్‌ను పర్యవేక్షిస్తుండగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ వేణు తెలిపారు. మృతదేహంపై ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే మడికొండ ఇన్స్‌పెక్టర్ 87126 85123, సబ్ ఇన్స్‌పెక్టర్ 87126 85248 నంబర్లలో సమచారం అందించాలని పేర్కొన్నారు.

తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే హైదరాబాద్-న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్-దానాపూర్ వెళ్లే పాట్నా ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వర్షాల కారణంగా కాజీపేట వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరదనీరు చేరడంతో పలు రైళ్లను అధికారులు రద్దు చేసి దారి మళ్లించారు. ఈ ఘటనతో తెలంగాణ, పాట్నా ఎక్స్‌ప్రెస్‌లను రీ షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కోబ్రా-యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్, రక్సోల్-సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వయా విజయనగరం, విజయవాడ మీదుగా దారి మళ్లించారు. కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి రైల్వే టీటీఈలు ప్రయాణికులను రైళ్లలో పంపేలా చేశారు.

ప్లాట్‌ఫాంలో నీరు తొలగింపు
కాజీపేట రైల్వేస్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫాం నిండా గురువారం వర్షం నీరు చేరడంతో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో శుక్రవారం రైల్వే అధికారులు ప్లాట్‌ఫాంలోకి చేరిన నీటిని బయటికి పంపించారు.

చెరువుగా రైల్వే స్టేడియం
కాజీపేట రైల్వే స్టేడియంలోకి వర్షం నీరు పెద్ద ఎత్తున చేరవడంతో చెరువును తలపించింది. ఇటీవల సుమారు రూ.35 లక్షలతో రైల్వే స్టేడియాన్ని అత్యాధునీకరించారు. కానీ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ సిస్టం లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా నీరు చేరుతుంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగాతో నీరు చేరడంతో స్టేడియం అంతా నిండి ఉంటుంది.

మిన్నంటిన రోదనలు


అజహర్ మృతదేహం


మజీద్‌ఖాన్ మృతదేహం


షరీఫ్ మృతదేహం


రషీద్ మృతదేహం


కరీమా మృతదేహం


లాల్‌బీ మృతదేహం


సమ్మక్క మృతదేహం


మహబూబ్‌ఖాన్ మృతదేహం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కొండాయి నుంచి మల్యాలకు వెళ్తున్న క్రమంలో కల్వర్టు తెగి 15 మంది వరదలో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇందులో 8 మంది మృతదేహాలు శుక్రవారం లభ్యమయ్యాయి. దీంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ పాపమంతా కల్వర్టు నిర్మించిన కాంట్రాక్టర్‌దేనని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని పరామర్శకు వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతితో తల్లిదండ్రులను కోల్పోయిన రషీద్, కరీమా కుమారుడు రఫీక్ వాపోయారు. జంపన్నవాగు ఉధృతిగా ఉండడంతో జిల్లా ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్డీ అశోక్, ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణిల చొరవతో పడవల ద్వారా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై గస్తీ

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి రైల్వే ట్రాక్‌పై రైల్వే అధికారులు శుక్రవారం ట్రాక్ గస్తీని పెట్టారు. వర్షాలకు గురువారం వడ్డేపల్లి రైల్వేట్రాక్ వద్దకు వరద నీటి ఉధృతి పెరగడంతో ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు రైళ్లను ఈ ట్రాక్‌మీదుగా రద్దు చేసి రాత్రి 10 గంటల తర్వాత తక్కువ వేగంతో పునరుద్ధరించారు. శుక్రవారం ఇంజనీరింగ్, బ్రిడ్జి విభాగం రైల్వే అధికారులు సిబ్బందిని ట్రాక్‌వద్ద గస్తీ పెట్టారు. వర్షం పడి ట్రాక్‌కు వర్షం నీరు తాకడంతో గస్తీ చేసే వారి సమాచారంతో రైళ్లను ఈ ట్రాక్‌పై నుంచి రద్దు చేసేలా చర్యలు తీసుకున్నారు. వరద ఉధృతికి ట్రాక్ ఏమైనా దెబ్బ తిని ఉండవచ్చని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతు చేసి రైళ్ల స్పీడ్ పెంచేలా చర్యలు తీసుకున్నారు.

తెరిపిచ్చినా తేరుకోలే..


శివనగర్‌లో రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు


బీఆర్ నగర్‌లో వరదలో నుంచి వెళ్తున్న ప్రజలు

- ఇంకా వరదల్లోనే పలు కాలనీలు
- శాశ్వత పనులతోనే ముంపునకు పరిష్కారం

వరంగల్ : కొద్దిపాటి వర్షానికే నగరంలోని పలు కాలనీలు జలమయం అవుతున్నాయి. ఐదు డివిజన్ల నుంచి వస్తున్న వరద నీరు చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లేందుకు టెయిల్ ఎండ్‌లో సరైన మార్గం లేకపోవడంతో పై ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇస్తున్నారే తప్ప ఆచరణలో చూపడం లేదు. బాక్స్ డ్రెయిన్ల స్థానంలో పైపులైన్లు నిర్మించడంతో వాటిలో వ్యర్థాలు పేరుకుపోయి నీరు చెరువులోకి వెళ్లక పోవడంతో ఈపరిస్థితులు నెలకొంటున్నాయి. చిన్నవడ్డేపల్లి చెరువు మత్తడి వద్ద వరద నీరు వెళ్లేందుకు తూములు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో నిర్వహణ గాలికి వదిలేశారు. గురువారం తూములు ఎత్తడంతోనే కాలనీలు ముంపు నుంచి బయట పడ్డాయి.

ముంపునకు కారణాలు..

- రామసముద్రం చెరువు స్థానంలో ఎస్‌ఆర్‌నగర్ వెలిసింది. ఈ చెరువు నుంచి చిన్నవడ్డేపల్లి చెరువు వరకు ఉన్న నాలా మొత్తం ఆక్రమణకు గురికావడంతో సాయిగణేష్‌కాలనీ, వివేకానంద కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.
- కాశిబుగ్గ- ఏనుమాముల ప్రధాన రహదారి మధ్య పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న నాలాకు ఎదురుగా ఉన్న స్థలం ఆక్రమణకు గురైంది. పక్క నుంచి నాలాను తక్కువ నిడివితో నిర్మించడం వల్ల పూర్తిస్థాయిలో నీరు చెరువులోకి వెళ్లడం లేదు.
- క్రిస్టియన్‌కాలనీ, గరీబ్‌నగర్, కోటిలింగాల గుడి, మణికంఠ కాలనీ, సాయిగణేష్‌కాలనీ, ఏనుమాముల, ఎన్టీఆర్‌నగర్, బాలాజీనగర్, మధురానగర్, వివేకానందకాలనీ ప్రాంతాల్లోని వరద నీరు చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లేందుకు సరిపడా నాలాలు లేవు. దీంతో పైకాలనీలు అన్ని ముంపునకు గురవుతున్నాయి.
- వర్షం ఎంత పడుతుంది, ఏమేరకు డ్రెయిన్లు ఉండాలన్న సాంకేతికత లేకుండా కాల్వలు నిర్మించడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కాశిబుగ్గ-ఏనుమాముల ప్రధాన రహదారిపై మరో రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాలి. దీంతో ఎక్కడి నీరు అక్కడి నుంచే చిన్నవడ్డేపల్లి చెరువులోకి పోతే కాలనీలు ముంపునకు గురికావు.
- నర్సంపేట రోడ్డు నుంచి గరీబ్‌నగర్, ఏనుమాముల జంక్షన్ల మీదుగా చిన్నవడ్డేపల్లి చెరువు వరకు ఉన్న 100 ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా పెద్ద డ్రెయిన్ కోసం తెచ్చిన పైపులు ఏడాది కావస్తున్నా వేయడం లేదు. దీంతో రోడ్డుపై వరద నీరు ప్రవహించి కింద ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యాయి.
- 14వ డివిజన్ లక్ష్మీగణపతికాలనీలోని 30 ఫీట్ల రోడ్డును ఇరువైపులా ఆక్రమించి ఇళ్లు నిర్మించడంతో వరద నీరు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి.
- చిన్నవడ్డేపల్లి, కోట చెరువుల్లో ఆక్రమణలు చేస్తూ మట్టి పోయడం వల్ల వరద నీరుకు అడ్డంకి ఏర్పడి పక్కనే ఉన్న కాలనీలు మునుగుతున్నాయి.

క్లుప్తంగా

ఎస్‌హెచ్‌ఓగా శ్రీధర్‌రావు



ధర్మసాగర్: ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా సీఐ శ్రీధర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సీఐ ఒంటేరు రమేష్ బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ రావుకు బదిలీపై వెళ్తున్న సీఐ రమేష్ పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. మండలంలోని ప్రజలకు చట్టపరంగా న్యాయం చేస్తామని, బాధితులు నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



ఆత్మకూరు: మండలంలోని దళిత వాడల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ శుక్రవారం డిమాండ్ చేశారు. మండలంలోని అక్కంపేట, నాగయ్యపల్లి గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పోచయ్య, యాదగిరి, రాజు, నరేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

భానుప్రసాద్‌కు అంతిమ వీడ్కోలు



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సారథి కళాకారుడు మాడ్గుల భానుప్రసాద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, హనుమకొండ జెడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్ ముల్కనూర్ గ్రామానికి చేరుకొని అంతిమయాత్రలో పాల్గొన్నారు. భానుప్రసాద్ పాడె మోసి అంతిమ వీడ్కోలు పలికారు. అంతకు ముందు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎల్కతుర్తి: ధూపదీప నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిద్ధాంతి రేణుకస్వామి, అధ్యక్షుడిగా సూరారం గ్రామానికి చెందిన సిద్ధాంతి గణేష్, ఉపాధ్యక్షుడిగా సముద్రాల సంపద ఆచార్య, కోశాధికారిగా నందనం రవికుమార్, కార్యదర్శి, ప్రచార కార్యదర్శిగా సిద్ధాంతి సదా నిరంజన్, సలహాదారుడిగా శ్రీనివాస్‌శర్మలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూరల్ సీఐగా మల్లేష్



శాయంపేట : పరకాల రూరల్ సీఐగా డి మల్లేష్ శుక్రవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ సీఐగా పని చేసిన శ్రీనివాసరావు టీటీఐకి బదిలీ కాగా ఆయన స్థానంలో మల్లేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మల్లేష్‌కు బదిలీపై వెళ్తున్న సీఐ శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మల్లేష్‌కు ఎస్సై దేవేందర్, సిబ్బంది స్వాగతం పలికారు.

సీఐని కలిసిన నాయకులు



ఆత్మకూరు: నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవిరాజును స్థానిక బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సర్కిల్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, రైతుసంఘం కో ఆర్డినేటర్ ఎన్కతాల్ల రవీందర్, జిల్లా నాయకులు బొల్లెబోయిన రవియాదవ్, నవీన్, రాజేశ్వర్‌రావు తో పాటు పలువురు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నడికూడ : చౌటుపర్తి-ముస్త్యాలపల్లి మధ్య భారీ వర్షానికి తెగిపోయిన రోడ్డు



భారీ వర్షం.. తీవ్ర నష్టం

ఇటీవల జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షం తీవ్ర నష్టాలను మిగిల్చింది. బుధవారం సాయంత్రం కురిసిన జడివానతో రోడ్లు, ఇళ్లు జలమయమయ్యాయి. భారీ వర్షంతో పరకాల చలివాగు వంతెన వద్ద రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాజిపేటలో రెండు ఇళ్ల గోడలు కూలిపోయాయి. చెరువులకు బుంగలు పడడంతో నీరు ఉధృతంగా ప్రవహించింది. హుజూరాబాద్ - పరకాల ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో అక్కడక్కడ ఇసుక మేటలు వేశాయి. పలు చోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో పలు గ్రామాలు అంధకారంలో మగ్గాయి. భారీ వర్షంలో సైతం అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

- సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు : ఇంటిచుట్టు నిలిచిన వరద నీరు



కమలాపూర్ : ఇసుక మేటలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది



శాయంపేట : తెగిన కొంతకుంట చెరువు



ఆత్మకూరు : పొంగిన కటాక్షపూర్ మత్తడి



పరకాల : చలివాగు దాటుతున్న ప్రయాణికులు



నడికూడ : తెగిపోయిన నార్లపూర్ - రోడ్డు

తెగుళ్ల నుంచి రక్షించుకోవాలి

పరకాల: అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను తెగుళ్ల నుంచి రక్షించుకునేందుకు రైతులు ముందు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ డాట్ సెంటర్ కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్‌కుమార్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో భారీ వర్షాలతో దెబ్బతిన్న పత్తి చేన్లను ఏఓ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటలను తెగుళ్ల నుంచి రక్షించుకునే విధంగా రైతులు మెలుకువలు పాటించాలన్నారు. కార్బండిజం, రూరికోజెల్ 2.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా రసం పీల్చే పురుగుల నివారణకు 5 ఎంఎల్ వేపనూనె లేదా ఫిప్రోనిల్ 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఏఈఓ అరుణ్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న దిలీప్‌కుమార్

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

హన్మకొండ అర్బన్: సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రిన్ సుల్తానా, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 26న పరకాల పట్టణ కేంద్రంలో చేపట్టిన జీపుజాత నగరానికి శుక్రవారం చేరుకుందని తెలిపారు. ఈమేరకు నగరంలోని జులైవాడలోని ఎస్టీ, ఎస్సీ హాస్టళ్లను సందర్శించిన వారు.. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ హాస్టళ్ల వార్డెన్లు రెగ్యులర్‌గా విధులకు హాజరుకావడం లేదని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వాపోయారు. చాలా చోట్ల హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తూ భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మయూరి శేఖర్, మంద కార్తీక్, పవన్, శ్రవణ్, సందీప్, రాజ్‌కుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మహిళా కాంట్రాక్టు అధ్యాపకుల రిలే దీక్షలు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని మహిళా కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పరిపాలన భవనం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజు శుక్రవారం కొనసాగించారు. దీక్షా శిబిరాన్ని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారందరిని క్రమబద్ధీకరించాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన విధంగానే యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను కూడా క్రమబద్ధీకరించాలని సూచించారు. దీక్షలు చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు కాంట్రాక్టు లెక్చరర్ డాక్టర్ భిక్షపతి సాయంత్రం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. దీక్షల శిబిరంలో శ్రీలత, రాధిక, రాజేశ్వరి, మంజుల, సునీత, రమాదేవి, శ్రీలత, వందన సిరి, బైరి నిరంజన్, చిర్ర రాజు, వెంకటగోపినాథ్, అరూరి సూర్యం, సత్య జూల, రవీందర్, సదాశివ్, నాగేశ్వర్ రావు, రాజు, నాగయ్య, లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, సూర్యనారాయణ, సాంబశివరావు, రవికుమార్, బ్రహ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలి

హన్మకొండ: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 19ఏళ్లుగా కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులుగా (సీఆర్‌టీ) పనిచేస్తున్న 1804 మందిని క్రమబద్ధీకరించాలని సీఆర్‌టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సోమేశ్వర్, రాష్ట్ర కోఆర్డినేటర్ దారావత్ బాలాజీ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఆర్‌టీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమ్మయ్య రాథోడ్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భూక్య తిరుపతి, రాష్ట్ర కోశాధికారి బాదావత్ శ్రీను, నాయకులు లక్ష్మణ్, సరేష్, హరీరాం, భరత్, హాథిరామ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కాజీపేట రైల్వే డీఎస్పీగా శ్రీనివాస్‌రావు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీఎస్పీగా శ్రీనివాస్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు జీఆర్పీ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇక్కడ డీఎస్పీగా గతంలో పనిచేసిన మల్లారెడ్డి.. అడిషనల్ ఎస్పీగా బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కాచిగూడ జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు పదోన్నతిపై వచ్చి కాజీపేట రైల్వే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించినట్లు కాజీపేట జీఆర్పీ సీఐ రాంమూర్తి తెలిపారు.

మిల్స్‌కాలనీ సీఐగా సురేష్

మామునూరు: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా టీ.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసి ముస్క శ్రీనివాస్ ఇంతేజార్ గంజ్ సీఐగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఖమ్మం కమిషనరేట్ కార్యాలయం నుంచి బదిలీపై సురేష్ వచ్చి బాధ్యతలు చేపట్టారు.

లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలనడం అన్యాయం

హన్మకొండ: తెలంగాణ లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని ఎంపీ సోయం బాబురావు చెప్పడం అన్యాయమని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు ఆయన శుక్రవారం తెలిపారు.

అన్ని విధాలా అండగా ఉంటా..

హన్మకొండ చౌరస్తా: వరద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భరోసా కల్పించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 9, 10, 11, 29వ డివిజన్లలోని కాకతీయ కాలనీ, అలంకార్, పెద్దమ్మగడ్డ, రామన్నపేట, రంగంపేట ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వినయ్‌భాస్కర్ శుక్రవారం పర్యటించారు. ఫైర్, ఎన్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్‌టీంల సహాయక చర్యలను పర్యవేక్షించారు. వరద బాధితులకు ఆహార పదార్థాలు, నీళ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరం ముంపు బారిన పడకుండా మరిన్ని చర్యలు చేపడుతామని చెప్పారు. ఆయన వెంట కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు



నడికూడ: బైక్ అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కంఠాత్మకూర్, రామకృష్ణపూర్ గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన సామాజి రాజేందర్, బోగిరి శ్రీనివాస్ బైక్‌పై రామకృష్ణపూర్ వెళ్లి కంఠాత్మకూర్‌కు వస్తుండగా బైక్ అదుపుతప్పింది. దీంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాల అయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

'చల్లా'కు కృతజ్ఞతలు



ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వీఆర్ఏలకు పే స్కేల్ జీఓ 81 పట్ల వీఆర్ఏల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కంది శిరీషరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పేస్కేల్ అమలు చేయడం వలన రాష్ట్రంలోని 16,758 మంది వీఆర్ఏలకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్వీట్లు అందించారు. వీఆర్ఏలు తదుపరి ఉద్యోగాల్లో అంకిత భావంతో సేవలు అందించాలని ఎమ్మెల్యే ధర్మారెడ్డి సూచించారు.

పునరుద్ధరించాలి

పరకాల: వరద ప్రవాహంతో నేలమట్టమైన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని హనుమకొండ డీఈ సామ్యానాయక్ సిబ్బందిని ఆదేశించారు. వివిధ గ్రామాల్లో ఏఈ సత్యనారాయణతో కలిసి శుక్రవారం పర్యటించారు. నేలమట్టమైన స్తంభాలను పరిశీలించిన ఆయన తక్షణమే స్తంభాలను సరిచేసి విద్యుత్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. లైన్ ఇన్స్‌పెక్టర్‌లు, లైన్‌మెన్‌లతో పాటు జేఎల్ఎంలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

హన్మకొండ అర్బన్: వర్షాకాలం వర్షాల కారణంగా సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, ఈక్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని సాయిబాబా దేవాలయ పరిసర ప్రాంత గుడిసెవాసులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బొమ్మినేని పాపిరెడ్డి, పెద్ది నారాయణగౌడ్, డాక్టర్ సంధ్యారాణి, ఈవీ.శ్రీనివాస్, పుల్లూరి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై ప్రణాళిక లేని ప్రభుత్వం

నయీంనగర్: నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేదని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండ 54వ డివిజన్ పోచమ్మకుంటలో జలమయమైన కాలనీలను శుక్రవారం పరిశీలించి బాధితులకు భోజన ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని సగానికి పైగా కాలనీల్లో ఇదే దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో నగరవాసులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రతీ సంవత్సరం ఇదే తంతు జరిగినా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఎద్దేవాచేశారు. నాలాపై ఎఫ్‌టీఎల్‌పై కబ్జా చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, బంక సంపత్, పల్లకొండ సతీష్, పల్లె రాహుల్‌రెడ్డి, గుంటి స్వప్న, కూర వెంకట్, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, సతీష్, సుమన్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి



దామెరలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు



కమలాపూర్ : పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

దామెర: జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు నల్ల చిరంజీవి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జీపీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు జీపీ కార్మికులకు డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులను పర్మనెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు బొబ్బిలి, ఉపాధ్యక్షుడు గోవిందు ఆనంద్, కోషాధికారి యజ్జం సురేష్, దండ్రె దేవేందర్, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు పొర్లుదండాలు పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండల జేఏసీ అధ్యక్షుడు అయిలయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, సలహాదారుడు స్వామి, నాయకులు భాస్కర్, అరుణ, ఎల్లస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

ఐనవోలులో..



సమ్మెలో మాట్లాడుతున్న గబ్బెట యాకయ్య

ఐనవోలు: తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, సిబ్బంది చేపట్టిన సమ్మె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం జీపీ ఉద్యోగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట యాకయ్య సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. గతంలో జీపీ ఉద్యోగ, కార్మికులు 45 రోజుల పాటు సమ్మె చేపట్టారని గుర్తుచేశారు. 24 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరియైనది కాదన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 31వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపేందుకు చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. జీపీ ఉద్యోగ, కార్మికులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్తూరి ఏశోబు, కొండేటి రవి, సుఖేందర్, బరిగెల మల్లేష్, మాదాసి కొమురమ్మ, కోమల, నితిన్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

శాయంపేట : మండల కేంద్రంలోని మచ్చర్లయ్య గట్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మచ్చర్లయ్య గట్టుపై జలపాధారలు ఏర్పాడ్డాయని తెలిపారు. మచ్చర్లయ్య గట్టుపై వెలిసిన శ్రీ మత్స్యగిరిస్వామి ఆలయం పక్కనే జలధారలు ఏర్పడడంతో ప్రజలు, యవకులు అధిక సంఖ్యలో తరలివచ్చి సంతోషంగా గడుపుతున్నారని అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి చొరవ తీసుకొని మచ్చర్లయ్య గట్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.



మచ్చర్లయ్య గట్టుకు పోస్తున్న జలధార

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

దామెర: రాష్ట్రంలోని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరంగా నిలుస్తోందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండలంలోని పసరగొండ, ఊరుగొండ, ల్యాదెల్ల, కోగిల్వాయి, పులుకుర్తి, తక్కళ్లపహడ్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 1,16,500 రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందలేని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడిన బాధితులు ప్రైవేటు ఆస్పత్రి చికిత్స కోసం ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే ధర్మారెడ్డి దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన వెంటనే సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, పసరగొండ సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, దమ్మన్నపేట్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్యాల రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దాడి మల్లయ్య, దాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శంకర్

భగీరథ ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటు



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

శాయంపేట : మండలంలో కురిసిన భారీ వర్షానికి మైలారం గ్రామ శివారులో మిషన్ భగీరథ గ్రిడ్ కోసం ఏర్పాటు చేసిన 6 స్తంభాలు నెలకొరిగాయి. విషయం తెలుసుకున్న డీఈ సామ్యానాయక్, ఏడీ దేవేందర్ నాయక్, ఏఈ రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. భగీరథ నీరు సరఫరా చేసేందుకు భగీరథ ఎక్స్‌ప్రెస్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చలివాగు ప్రాజెక్టు వద్ద పడిపోయిన 33 కేవీ విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. పునరుద్ధరణ పనులు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సంతోష్, గ్రామ హెల్పర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాగుర్లకు టికెట్ ఇవ్వాలి

నడికూడ: బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే టికెట్ నర్సక్కపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుకు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు.